క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన



నగదు, జ్ఞాపికలతో సత్కరిస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు

పాతపట్నం: ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు చదువులో మరింత ప్రోత్సహం చేందుకు రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ప్రోత్స హించడం అభినందనీయమని హెచ్ఎం ఎన్. కుమారస్వామి అన్నారు. మండలంలోని రొం పివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంత్సరంలో పదో తరగతి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు అగతముడి మోహిత్ కుమార్, కిక్కర జగదీశ్వరరావును నగదుతోపాటు జ్ఞాపిక, పురస్కారాలను రొమ దల సర్పంచ్ ఎం.అప్పలనాయుడు సోమవారం అందించారు. ట్రస్టు అధ్యక్షుడు పి.రామరాజు, ఉపాధ్యాయులు కృష్ణవేణి, గోవిందరావు, రమణ, కేశవ్ పాల్లాయ్, నారా యణమూర్తి, మంజుశ్రీ, ఢిల్లేశ్వరి పాల్గొన్నారు.

చికెన్ షాపుల యజమానులకు నోటీసులు



చికెన్ షాపు యజమానికి నోటీసులు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి

మెళియాపుట్టి: 'దుర్వాసనతో అవస్థలు' అనే శీర్షికన ఈ నెల 3వ తేదీన సాక్షిలో ప్రచురిత మైన కథనానికి స్థానిక పంచాయతీ అధికా రులు స్పందించారు. కార్యదర్శి అప్పారావు చికెన్ షాపుల నిర్వాహకులకు సోమవారం నోటీసులు అందజేశారు. చికెన్ వ్యర్థాలను మహేంద్రతనయ నదీ వంతెన సమీపంలోని మలుపులో వేయడంతో కుక్కలు సంచారం, కీటకాలు అధికమై ప్రజలు ఇబ్బంది పడుతు న్నారని నోటీసులో పేర్కొన్నారు. రెండు రోజుల్లో సమాధానం ఇవ్వకపోతే చర్యలు తీసు కుంటామన్నారు.

ఎరువుల పంపిణీ



ఎరువులు పంపిణీ చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

బూర్జ: మండలంలోని నీలాదేవిపురం గ్రామ రైతులకు సోమవారం ఎరువులు పంపిణీ చేశారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

రక్షణ గోడ నిర్మాణం



నిర్మాణం చేపట్టిన రక్షణ గోడ

సరుబుజ్జిలి: పురుషోత్తపురం–రొట్టవలస ఆర్ అండ్‌బీ రహదారిలో గల మండలమ్మ తల్లి ఆలయం సమీపంలో ఇటీవల స్కూల్ బస్సు రక్షణ గోడను ఢీకొట్టి పడిపోయింది. అప్పటి నుంచి రక్షణ గోడ మరమ్మతులకు నోచుకో లేదు. దీనిపై పురుషోత్తపురం గ్రామానికి చెం దిన మొదలవలస ఆంజనేయులు స్పందిం చారు. తన సొంత డబ్బులతో రక్షణ గోడను సోమవారం నిర్మించారు. ఆయనకు గ్రామ స్తులు అభినందించారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో చెట్టు దగ్ధం



కాలిపోతున్న మర్రి చెట్టు

మెళియాపుట్టి: మెళియాపుట్టి నుంచి పలాస వెళ్లే రహదారిలోని పెద్దమడి గ్రామం వద్ద రహదారి పక్కనే ఉన్న భారీ మర్రి చెట్టు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో చెలరేగిన అగ్ని కీలల్లో కాలి నేలకొరిగింది. ఆ సమయంలో వాహనాలేవీ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సంఘటన జరిగిన ప్రదేశానికి కూతవేటు దూరంలో గిరిజన బాలికల సం క్షేమ పాఠశాల, వసతిగృహం ఉన్నాయి. సోమవారం కురిసిన వర్షానికి వైర్లు తెగి చెట్టుపై పడటంతో భారీగా మంటలు చెలరే గాయి. చెట్టు కాలిపోతున్న దృశ్యాన్ని దూరం నుంచి చూసిన స్థానికులు విద్యుత్‌శాఖ సిబ్బం దికి సమాచారం అందించారు. కొంతస మయం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వాహనాల రాకపోకలు నిలిచిపో యాయి.



ఆశలు నెరవేరేనా..!

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రజలకు అనేక హామీలు ఇచ్చారు. వీటిని నమ్మిన జనం వారికి అధికారాన్ని కట్ట బెట్టారు. సమస్యల పరిష్కారం, పథకాల అమలు, నిధుల మంజూరుపై దృష్టి సారిం చాలని ప్రజలు కోరుతున్నారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఎమ్మె ల్యేలు తమ నియోజకవర్గ జనానికి ఇచ్చిన హామీల అమల కోసం శాసనసభలో ప్రస్తావిం చాలని ప్రజలు కోరుతున్నారు.

– నరసన్నపేట, ఎల్.ఎన్.పేట/ ఆమదాలవలస



పూడికపోతున్న రాజుల చెరువు

నరసన్నపేట నియోజకవర్గంలో..

- నరసన్నపేటలోని రాజుల చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి, పర్యాటకంగా తీర్చిది ద్దాలి. చెరువులో ఉన్న ఆక్రమణలు తొలగించాలి.
- కూరగాయల మార్కెట్‌ను ఆధునీకరించాలి. వీధుల్లో ఉన్న కూరగాయల షాపులన్నీ ఒకే చోటకు తీసుకువచ్చి మార్కెట్‌కు పూర్వ వైభవం తీసుకురావాలి.
- నరసన్నపేట పంచాయతీ పరిధిలోని 80 వీధుల్లో నివసిస్తున్న 30 వేల జనాభాకు వీలుగా మంచినీటి సౌకర్యం మెరుగుపరచాలి. తాగునీ టికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న మరో 9 వీధు లకు పూర్తి స్థాయిలో తాగునీరు అందించాలి.
- మండలంలో శివారు గ్రామాలైన మడపాం, గోపాలపెంట, దేవాది, పోతయ్యవలస, బుచ్చిపేట తదితర గ్రామాలకు సాగునీరు అం దించేందుకు వీలుగా ఎత్తిపోతల పథకం నిర్మిం చాలి. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఎత్తిపో తల పథకం మంజూరు చేయాలి.
- వంశధార నదీ తీరంలో కోతకు గురవుతున్న గ్రామాల రక్షణకు వీలుగా వరద కట్టలు నిర్మిం చాలి. ఏళ్ల తరబడి వెంటాడుతున్న ఈ సమస్య నుంచి ప్రజలను గట్టెక్కించాలి.
- సారవకోట మండలంలో అసంపూర్తిగా ఉన్న బొంతు ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపట్టాలి.
- వడ్డినవలస నుంచి జలుమూరు మండలంలోని కొమనాపల్లికి వెళ్లే రోడ్డు నిర్మాణం చేపట్టాలి.
- తొగిరి ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేయాలి.

సాగునీటి సమస్య పరిష్కరించాలి..



మడపాం, గోపాలపెంట, పోతయ్యవలస, బుచ్చిపేట తదితర గ్రామాల్లో సాగునీటి సమస్య ఏటా కొనసాగుతుంది. ఈ గ్రామాల పక్కనే వంశధార నది ఉన్నా సాగునీరు అందక రైతులు ఏటా నష్ట పోతున్నారు. వంశధార నదికి ఆనుకుని మడపాం వద్ద ఎత్తిపోతల పథకం నిర్మించాలి. రానున్న ఖరీఫ్‌కు అయినా రైతులను సాగునీరు అం దేలా చూడాలి. – **రువ్వ వాసు**, ఎంపీటీసీ సభ్యుడు, మడపాం, నరసన్నపేట

బొంతు ఎత్తిపోతల పథకం పూర్తిచేయాలి



బొంతు ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తే ఎం తోమంది రైతులకు సాగు నీరు అందుతుంది. ఈ ప్రాంత రైతులకు సాగునీటి కష్టాలు తీరు తాయి. మండలంలో ఉన్న పలు సమస్యలపై ఎమ్మెల్యే దృష్టి సారించాలి.

– **పోలాకి కేశవరావు**, రైతు, బెజ్జి, సారవకోట మండలం



ఆమదాలవలసలో మూత పడ్డ సుగర్ ఫ్యాక్టరీ

ఆమదాలవలసలో..

ఆమదాలవలస పట్టణ కేంద్రంలోని సుగర్ ఫ్యాక్టరీ నడిచేటప్పుడు సస్యశ్యామలంగా ఉండేది. దశాబ్దాల కాలంగా ఈ ఫ్యాక్టరీ మూతపడడంతో నియోజకవర్గ వ్యాప్తంగా చెరుకు పండించే రైతులు పూర్తిగా పంటను విడిచిపెట్టారు. ఈ ఫ్యాక్టరీ మూతపడటంతో రైతులు, వ్యాపారస్తులు, నియో జకవర్గ ప్రజలకు జీవనోపాధి లేకుండా పోయింది. మూతపడిన సుగర్ ఫ్యాక్టరీ తెరిపించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత రైతులు ఆశ పడుతున్నారు.

ఫ్యాక్టరీ తెరిపిస్తే చాలావరకు వలసల నివారణ చేయవచ్చునని అంటున్నారు. నియోజకవర్గం లోని పలు గ్రామాలకు రోడ్లు నిర్మించాలి. సరుబు జ్జిలి, బూర్జ మండలంలోని నదీ తీర గ్రామాల వద్ద వరద కట్టలు నిర్మించాలి.




కడపలవాని గెడ్డలో వరదనీటి ప్రవాహం

పాతపట్నం నియోజకవర్గంలో

- పాతపట్నం నియోజకవర్గంలోని అనేక గ్రామా లకు రహదారి సౌకర్యం మెరుగుపర్చాలి.
- గిరిజన గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పిం చాలి.
- నియోజకవర్గంలోని ఐదు మండలాల పరి ధిలో ఉన్న అన్ని గ్రామాలకు వంశధార రిజర్వాయర్ నుంచి తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలి.
- కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మం డలాల నుంచి ప్రవహిస్తున్న వంశధార నదీ తీరంలో వరదగట్టు నిర్మాణం పనులు చేపట్టా లి.
- ఎల్.ఎన్.పేట మండలంలో దబ్బపాడు–తు రకపేట గ్రామాల మధ్య కడపలవాని గెడ్డపై వంతెన నిర్మాణం, కడపలవాని గెడ్డలో ఆక్రమణలు తొలగింపు, జంబాడ రిజర్వా యర్ కుడి, ఎడమ కాలువల నిర్మాణం చేపట్టాలి.
- పాతపట్నం మండలానికి అగ్నిమాపక కేం ద్రం, ప్రభుత్వ ఐటీఐ, పాలిటెక్నికల్, మహిళా జూనియర్ కాలేజీలు మంజూరు చేయాలి.
- హిరమండలం మండలంలో జిల్లేడుపేట వద్ద మహేంద్రతనయ నదిపై వంతెన నిర్మాణం, వంశధార నిర్వాసితుల్లో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.
- నిర్వాసితులు ఖాళీ చేసి వచ్చేసిన పాత గ్రామాల్లోని సుమారు 2 వేల ఎకరాల మిగులు భూములకు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందించాలి.
- వంశధార రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రం గా అభివృద్ధి చేయాలి.
- మెళియాపుట్టి మండలంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి.
- వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు ద్వారా మెళియాపుట్టి మండలంలోని అన్ని గ్రామాలకు తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలి.
- కొత్తూరు మండలంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, బాలికల ఉన్నత పాఠశాల మంజూరు చేయాలి.
- హడ్డుబంగి గెడ్డకు ఎస్.ఎస్ కాలనీ వద్ద తిత్లీ తుఫాన్‌కు కొట్టుకుపోయిన భారీ చెక్‌డ్యాం మళ్లీ నిర్మిస్తే ఆరు రెవెన్యూ గ్రామాలకు చెం దిన 2 వేల ఎకరాలకు సాగునీరు అందుతుం ది.
- మెట్టూరు వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి.

ఐటీడీఏ ఏర్పాటు చేయాలి



శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాలో ఉన్న ఐటీడీఏ (సీతంపేట) జిల్లాల పునర్విభజనలో భాగంగా మన్యం జిల్లాలో ఉండిపోయింది. జిల్లాలో అత్యధిక గిరిజన ప్రజలున్న రెండో మండలం మెళియా పుట్టి. ముఖ్యమంత్రి చంద్రబాబు మెళియా పుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తామని ఎన్నిలక ముందు మాటిచ్చారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే గోవిందరావు ఐటీడీఏపై మాట్లాడాలి. గిరి జన యువతకు అనేక ఉద్యోగాలు రావడమే కాకుండా.. మండలం అభివృద్ధి చెందుతుంది.

– **సవర సుభాష్**, గిరిజన నేత, భరణికోట, మెళియాపుట్టి మండలం

బ్యాంక్ లింకేజీ లక్ష్యాలు పూర్తిచేయండి



మాట్లాడుతున్న జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సూర్యకిరణ్

ఆమదాలవలస: బ్యాంక్ లింకేజీ లక్ష్యాలను పూర్తిచే సేందుకు మండల సమాఖ్యలు అంకితభావంతో పనిచేయాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సూర్య కిరణ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో జాయింట్ మండల్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. రుణాలు చెల్లించని సంఘాలను గుర్తించాలన్నారు. స్త్రీనిధి ద్వారా రుణాలు అందించి లక్ష్యాలను పూర్తిచేయాలన్నారు. రైతులకు సకాలంలో వ్యవ సాయ రుణాలు అందేలా చర్యలు తీసుకోవాల న్నారు. మహిళా స్వయం శక్తి సంఘాల సభ్యులు దాచుకున్న పొదుపు డబ్బుల నుంచి సభ్యురాలి అవసరం మేరకు అప్పులు ఇచ్చుకోవడానికి ఇంట ర్నల్ లాండింగ్‌ను బ్యాంకు మేనేజర్లు ప్రోత్సహిం చాలన్నారు. ఆమదాలవలస డీసీసీబీలో మాత్రమే 70 సంఘాలకు రుణాలు మంజూరు చేయడం జరి గిందన్నారు. తిరిగి సక్రమంగా రీపేమెంట్ జరగ డంతో రెండోసారి లింకేజీకి సిద్ధంగా ఉన్నారన్నారు. అసిస్టెంట్ లీడ్ బ్యాంక్ మేనేజర్ ఉమాశంకర్, స్టేట్ బ్యాంక్ మేనేజర్ కిరణ్, యూనియన్ బ్యాంక్ మేనే జర్ రవికుమార్, ఏపీఎంలు రవిరాజా, పైడి కూర్మారావు, కమల కుమారి, పాండ్యన్, సీఎఫ్ఎ ల్‌లు పాల్గొన్నారు .

ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేయాలి

నరసన్నపేట: మండలంలో 530 మంది విద్యార్థులు డ్రాపౌట్స్‌గా కనిపిస్తున్నారని, వాస్త వానికి ఒక్క విద్యార్థి కూడా డ్రాపౌట్స్‌గా లేరని ఎంఈఓ శాంతారావు అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చేరిన విద్యార్థుల పేర్లు యూ డైస్ యాప్‌లో నమోదు చేయకపోవడమే దీనికి కారణమన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాల యంలో సోమవారం ప్రైవేట్ స్కూల్ యాజ మాన్య ప్రతినిధులతో సమావేశం నిర్వహిం చారు. విద్యార్థుల పేర్లు విధిగా యాప్‌లో పొం దుపర్చాలన్నారు. యాప్‌లో పేర్లు నమోదు చేయని స్కూళ్లపై చర్యలు తీసుకోవడం జరుగు తుందన్నారు. మంగళవారం నాటికి పేర్లన్నీ ఆన్‌లైన్లో నమోదు చేయాలన్నారు. డ్రాపౌట్స్‌పై జిల్లా కలెక్టర్ సీరియస్‌గా ఉన్నారన్నారు. ఎంఈ ఓ–2 దాలినాయుడు పాల్గొన్నారు.

పశువులకు వ్యాక్సిన్లు

బూర్జ: పాడి పశువులకు వ్యాక్సినేషన్‌ను పశుసై ద్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో వేసినట్లు వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు తెలియజే శారు. మండలంలోని ఓ.వి.పేటలో పశువులకు లంపీస్కిన్ వ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సోమవారం వ్యాక్సినేషన్ వేసి నట్లు చెప్పారు. సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ, పశువైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల రక్షణపై ప్రత్యేక దృష్టి

ఎల్.ఎన్.పేట: మహిళల రక్షణ పట్ల ప్రత్యేక దృ ష్టి సారించాలని కొత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ యు.విమలకుమారి అన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమైఖ్య భవనంలో సోమవారం నిర్వహించిన భేటీ బచావో.. భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలపై లైం గిక వేధింపుల నియంత్రణకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళలు వేధింపులకు గురైతే వెంటనే ఇంటర్నల్ కం ప్లాట్ సెల్ (ఐసీసీ)కు ఫిర్యాదు చేయాలన్నారు. మహిళల సంవరక్షణకు అంగన్‌వాడీ కార్యక ర్తలు చురుగ్గా పనిచేయాలన్నారు. మహిళా చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహిం చాలని సూచించారు. మహిళల్లో అక్షరాస్యత శాతం పెంచేలా కృషి చేయాలన్నారు. ఉప తహ సీల్దార్ రషీద్ అమ్మద్, సూపర్‌వైజర్లు శాంతకు మారి, జ్యోతిలక్ష్మి, నవభారతి తదితరులు పాల్గొన్నారు.

కలాసీల ఆందోళన



ధర్నా చేస్తున్న పాత కలాసీలు

కొత్తూరు: మండలంలోని వసప గ్రామం వద్ద ఉన్న వేర్‌హౌస్ గొదాంలో పనిచేస్తున్న కలాసీలు సోమవారం ఆందోళన చేపట్టారు. గొదాం నుంచి బియ్యం లారీలు బయటకు వెళ్లకుండా అడ్డుకుని దర్నా చేశారు. ఈ గొదాంలో వసప, నివగాం, గూనభద్ర గ్రామాలతోపాటు పలు గ్రామాలకు చెం దిన కలాసీలు గత కొంత కాలంగా పని చేస్తున్నట్లు కలాసీల మేస్త్రీ పల్ల బాలకృష్ణ తెలిపారు.

నివగాం, వసప, వసప కాలనీ, కుంటిభద్ర, మహర్తాపురం గ్రామాలకు చెందిన కొత్త వ్యక్తులు సోమవారం గొదాం వద్దకు వచ్చి బియ్యాన్ని లారీల్లో లోడ్ చేశారన్నారు. ఇలా చేస్తే చాలా కాలం గా పనిచేస్తున్న కలాసీలంతా రోడ్డున పడతా మన్నారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడు తున్నామన్నారు. మరికొంత మంది చేరితే రోజువారీ వేతనం తక్కువగా వస్తుందన్నారు. దీనిపై అధికారుల స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై గొదాం మేనేజర్ వద్ద ప్రస్తావించగా.. పాత కలాసీలతోపాటు కొత్తవారితోనూ ఆగష్టు ఒకటో తేదీ వరకు పనిచేయించాలని కలాసీలను పంపిస్తున్న హెచ్ఎ న్‌టీ సంస్థ మేనేజర్ తనకు చెప్పారన్నారు. అందు వల్లే కొత్త వారితో పని చేయించినట్లు మేనేజర్ తెలి పారు. ఈ వివాదంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానన్నారు.

టీఎల్‌ఎంతో ఉత్తమ బోధన



నరసన్నపేట: సత్యవరంలో టీఎల్‌ఎంను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నరసన్నపేట: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో శిక్షా సప్తాహ్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మొదటి రోజు టీఎల్‌ఎం డే నిర్వ హించారు. జాతీయ నూతన విద్యా విధానం –2020లో భాగంగా చేపడుతున్న కార్యక్రమాన్ని అన్ని స్కూళ్లలో విదిగా నిర్వహించాలని ఎంఈఓ దాలినాయుడు ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో చేపట్టిన కార్యక్రమంలో ఎంఈఓ పాల్గొన్నారు. సత్యవరం స్కూల్లో కూడా విద్యా ర్థులు టీఎల్‌ఎంలను ప్రదర్శించారు.

పాతపట్నం: కొదూరు, ప్రహరాజపాలెంలోని మం డల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాల్లో భాగంగా బోధన భ్యాసన కృత్యాల ప్రదర్శనను ఎంఈఓలు శ్రీధర్, తిరుమలరావు ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన టీఎల్ ఎం వివరాలను అడిగి తెలుసుకున్నారు.

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

పాతపట్నం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండ లంలోని ఈ నెల 23 నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించ నున్నట్లు ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు సోమవారం తెలిపారు. 23న, 24వ, 25వ తేదీల్లో పాతపట్నం, బూరగాం, కొరసవాడ, తెంబూరులో, 25న పాతప ట్నం జూనియర్ కళాశాలలో, 26న రొంపివల, పెద్దలోగిడి, గంగువాడ, 27న పాతపట్నం సచివాల యం–3, సీది, తెంబూరులో ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తామని తెలిపారు.

నరసన్నపేట: మండలంలోని పలు ప్రభుత్వ పాఠ శాలల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నామని ఎంఈఓ పేడాడ దాలినాయుడు సోమవా రం తెలి పారు. విద్యార్థులకు కొత్తగా ఆధార్ కావాలన్నా, ప్రస్తుత ఆధార్ కార్డులో తప్పులు సవరణ చేసుకో వాలన్నా, పర్మినెంట్ ఆధార్ పొందాలన్నా క్యాం పుల్లో పొందవచ్చన్నారు. నరసన్నపేట జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కంబకాయ, ఉర్లాం, సుందరాపురం, బాడాం, బొరి గివలస, సత్యవరం, లుకలాం, కంబకాయ, మడ పాం, మాకివలస, నరసన్నపేట బోర్డు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాలల్లోనూ ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

హిరమండలం: మండలంలోని కిట్టాలపాడు, గులు మూరు, హిరమండలం–3 సచివాలయం పరిధిలో ఆధార్ ప్రత్యేక కాంపులు నిర్వహించడం జరుగు తుందని ఎంపీడీఓ స్వరూపారాణి తెలిపారు.

పొందూరు: మండలంలోని అన్ని సచివాలయాల్లో ఆధార్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సూర్యనారాయణ తెలిపారు. 23న నందివాడ, గోక ర్నపల్లి, కొంచాడ, వీఆర్ గూడెం, అచ్చిపోలవలస గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని మెళియాపుట్టి, పట్టుపురం, పెద్దపద్మాపురం, పరశురాంపురం సచివాలయాలలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీఓ భాస్కరరావు తెలిపారు.

ముంపు పొలాల పరిశీలన



జలుమూరు: రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు



సరుబుజ్జిలి: రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

జలుమూరు: వర్షాల కారణంగా నీట మునిగిన పం ట పొలాల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతులు నష్టం నుంచి తప్పించుకోవచ్చని రాగోలు వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ పి.ఉద య్‌బాబు, కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ కె.భా గ్యలక్ష్మి తెలిపారు. అచ్యుతాపురం గ్రామంలో ముం పునకు గురైన వరి పంట పొలాలను ఆమె సోమవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. జూన్‌లో విత్తిన విత్తనాలు పిలక దశలో ఉండగా జూలై నెలలో విత్తినవి నారుమడి దశలో ఉన్నాయన్నారు. వర్షాలకు నారుమడి విత్తనం చల్లిన రెండు మూడు రోజులు నీట మునిగితే మొలక శాతం తగ్గుతుందని, దీని కోసం నీటిని వీలైనంత వేగంగా బయటకు పంపుకోవాలన్నారు. అలాగే విత్తన నాటి ఏడు రోజులు నుంచి 30 రోజులు వయసు గలవి ఐదు రోజులు కంటే ఎక్కువ మునిగితే నారుమడికి కిలో యూరియా, కిలో పొటా ష్‌తోపాటు ఒకటి లేదా రెండు గ్రాముల కార్బం డిజం వేసుకోవాలన్నారు. అలాగే పిలక దశలో నీట మునిగితే పొలం నుంచి నీరు మొత్తం బయటకు పోయిన తర్వాత 20 కిలోల పొటాష్, 20 కిలోల యూరియా చల్లుకోవాలన్నారు. నాట్లు వేసిన 15 రోజుల తర్వాత ఊదర, ఇతర గడ్డి జాతులు ఉంటే సైహలోఫాష్ ఎకరాకు 400 మిల్లీ లీటర్లు మందు తగినంత నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వీటి వల్ల కలుపు నివారణ చేసుకోవచ్చునని తెలి పారు. తుంగ, గరిక వంటి మొండి రకాల కలుపు ఉంటే నీరు బెంటాజోన్ ఎకరాకు ఆర లీటరు తగి నంత నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. వీరితోపాటు ఏడీఏలు రవీంద్ర భారతి, వెం కటరావు, ఏఓ సురేష్ కుమార్ రైతులు ఉన్నారు.

సరుబుజ్జిలిలో..

సరుబుజ్జిలి: ఇస్కలపాలెం, కొండవలస గ్రామాల్లోని ముంపు ప్రాంతాలను ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సి.హెచ్.బాలకృ ష్ణ, ఎస్.కిరణ్‌కుమార్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ముంపుబారిన పంటను ఎలా సంరక్షించకోవాలన్న విషయంపై రైతులకు అవగాహన కల్పించారు. నీట మునిగిన నారుమడుల నుంచి నీటిని బయటకు తీసి కార్బని జాన్ని నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచిం చారు.

పరామర్శ..



సారవకోట: చిన్నబాబు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ధర్మాన కృష్ణదాస్



బూర్జ: పెంటమనాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న తమ్మినేని సీతారాం

బూర్జ: మండలంలోని చిన్నలంకాం గ్రామానికి చెం దిన బింగి పెంటమనాయుడు కోడలు ఈశ్వరమ్మ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం పరామర్శిం చారు. పరామర్శించిన వారిలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ గుమ్మడి రాంబాబు, మండల యువజన అధ్యక్షుడు మామిడి శ్రీనివాసరావు, చీడివలస సర్పంచ్ బూరి శ్రీరామ్మూర్తి తదితరులు ఉన్నారు.

చిన్నబాబు కుటుంబానికి..

సారవకోట: మండలంలోని మూగుపురం గ్రామా నికి చెందిన ఎన్ని చిన్నబాబు ఇటీవల మృతి చెం దారు. ఆ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృ ష్ణదాస్ సోమవారం పరామర్శించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జేఏసీ కన్వీనర్ నక్క తులసీదాస్, సర్పంచ్ ఇసై షణ్ముఖరావు, వైఎ స్సార్‌సీపీ నాయకులు, తదితరులు ఉన్నారు.

108 సేవలపై ఆరా



రికార్డులను పరిశీలిస్తున్న జగన్

పాతపట్నం: అత్యవసర సమయాల్లో మరింత బాధ్యతగా పనిచేయాలని, 108 వాహనం సేవలను ప్రజలకు సకాలంలో అందించాలని పలాస డివిజన్ అధికారి జి.జగన్ అన్నారు. పాతపట్నం సీహెచ్ సీలో ఉన్న 108 వాహనాన్ని సోమవారం పరిశీలిం చారు. వాహనం పనితీరు, పరికరాలు, డ్రగ్, సిబ్బంది రికార్డులను తనిఖీ చేశారు. ఫోన్ వచ్చిన వెంటనే స్పందించాలన్నారు. ఇటీవల కాలంలో వర్షాలు కారణంగా అప్రమత్తంగా ఉండాలని, పిడుగుపాటు, పాముకాట్లు, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందన్నారు. మెడికల్ టెక్నీషియన్ కె.అఫీస్, పైలట్ చిన్న, సిబ్బంది పాల్గొన్నారు.